క్లుప్తంగా

ప్రతి విద్యార్థి నైపుణ్యం పెంపొందించుకోవాలి



ఉపాధ్యాయులతో ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు

అల్లిపురం: ప్రతి విద్యార్థి నైపుణ్యం పెంపొందించుకోవాలని నాంది ఫౌండేషన్ ప్రతినిధి వరలక్ష్మి అన్నారు. ఎంజీఎం హైస్కూల్లో గురువారం జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జీవితంలో ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, వాటర్ బాటిళ్లు, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌కేవీఎస్ నాగభూషణం, పీటీ మాస్టర్ రవికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు



జోన్-3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధిలోని ఎంపిక చేసిన సచివాలయాల్లో ఈ నెల 21 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. జోనల్ కార్యాలయంలో గురువారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. పుట్టిన నాటి నుంచి ఇంతవరకు ఆధార్ కార్డు నిమిత్తం నమోదు కాని పిల్లల కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని న్యూ వెంకోజిపాలెం-106 సచివాలయం, మద్దిలపాలెంలోని 117 సచివాలయంలో శిబిరాలు జరుగుతాయన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125 నంబర్ సచివాలయం, పాత రేసపువానిపాలెంలోని 138 నంబర్ సచివాలయంలోను శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143 నంబర్ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రులు తమ ఆధార్ కార్డులతో ఈ సచివాలయాల్లో ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలలు, వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత

న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ

విశాఖ లీగల్: ప్రభుత్వ పథకాలపై అందరికీ అవగాహన అవసరమని విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చే బాధ్యత ప్రభుత్వ శాఖలు చిత్తశుద్ధితో చేపట్టాలన్నారు. బాలలను సంరక్షించే బాధ్యత సమాజంలో అందరిపైనా ఉందన్నారు. లైంగిక దాడులకు గురవుతున్న బాలల రక్షణ బాధ్యతలను అందరూ స్వీకరించాలన్నారు. వయోవృద్ధులు సైతం కుటుంబాల నుంచి వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలలు, వృద్ధుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. విశాఖపట్నం ఐసీడీఎస్ అధికారి జయ దేవి, అనకాపల్లి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఐసీడీఎస్ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ, వయోవృద్ధులు, బాలల సంక్షేమ శాఖ అధికారులు, సేవా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సరసమైన ధరలు.. కళ్లు చెదిరే బ్రాండ్లు

పేద, మధ్య తరగతి వర్గాల అవసరాలు తీరుస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు

అందుబాటు రేట్లలో షాపింగ్ మాల్స్‌కు దీటుగా విక్రయాలు

జగదాంబ నుంచి పాత నగరం వరకు భారీ ఎత్తున వ్యాపారం



మహిళల మనసు దోచే ఫ్యాన్సీ ఐటెమ్స్





స్కూల్ బ్యాగ్‌లు, చెప్పుల అమ్మకాలు

జగదాంబ: దాబాగార్డెన్స్ మొదలుకొని.. జగదాంబ.. సూపర్ బజార్ ఏరియా, పూర్ణామార్కెట్ ప్రాంతాలన్నీ ఫుట్‌పాత్ వ్యాపారాలతో కళకళలాడుతూ ఉంటాయి. పేరెన్నిక గన్న బ్రాండ్లకు ఏమాత్రం తీసిపోని అనేక రకాల వస్తువులు దొరుకుతాయి. పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటు ధరలో దొరికే ఈ సామగ్రి కోసం నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు విచ్చేస్తూ ఉంటారు.

ముఖ్యంగా వస్త్రాలు..

జగదాంబ నుంచి పూర్ణామార్కెట్ వరకు వన్‌టౌన్ రహదారి, పండువుల్లల సందు, పోలీస్ బ్యారెక్స్ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై వరుసగా వస్త్ర దుకాణాలు కనిపిస్తాయి. పండగలు వచ్చాయంటే చిన్నాపెద్దా అంతా ఇక్కడే ఉంటారు. పెద్ద ఎత్తున ఇంటిల్లిపాదీ వస్త్రాలు కొనుగోలు చేస్తారు. మరీ ముఖ్యంగా పోలీస్ బ్యారెక్స్ వద్ద కేవలం దుస్తులు మాత్రమే విక్రయిస్తూ రోడ్డుకు రెండు వైపుల ఫుట్‌పాత్ వ్యాపారులు కనిపిస్తారు. వీరి వద్ద దొరకని ఐటెం ఉండదు. చిన్న పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులు కోరుకునే అన్ని రకాల వస్త్రాలు వీరి వద్ద దొరుకుతాయి. అలాగే శీతాకాలంలో అయితే దేశంలో ఎక్కడా దొరకని వెరైటీ రకాల ఉన్ని దుస్తులు కూడా ఇక్కడ అందుబాటు ధరల్లో లభ్యమవుతాయి.

ఇంటికి అవసరమైనవన్నీ..

ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా యువతను ఆకట్టుకునే అనేక రకాల డిజైన్ల దుస్తులు, మహిళలు కోరుకునే కాస్మొటిక్స్, గృహోపకరణాలు, పాదరక్షలు, స్కూలు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, గోల్డ్ కోటెడ్ ఆభరణాలు, బెడ్‌షీట్లు, పిల్లోకవర్లు.. ఒకటేమిటి ఇంటికి ఏది అవసరమో అవన్నీ అనువైన ధరల్లో ఇక్కడ దొరుకుతాయి.

మార్వాడీల హవా..

పాతనగరంలో పెద్ద ఎత్తున దొరికే వస్తువుల్లో ఫ్యాన్సీ ఐటమ్స్‌దే సింహభాగం అని చెప్పాలి. ఈ వ్యాపారం చేసే మార్వాడీలంతా ప్రసాద్‌గార్డెన్స్, పూర్ణామార్కెట్‌లో పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ దుకాణాలకు కేవలం నగరం నుంచే కాకుండా అనకాపల్లి, అల్లూరి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, బొబ్బిలి, మన్యం జిల్లాల నుంచి కూడా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. వీరు కేవలం మహిళలకు కావాల్సిన ఫ్యాన్సీ వస్తువులే కాకుండా చిన్నారుల ఆట వస్తువుల నుంచి ఇంట్లోకి కావాల్సిన ఎలక్ట్రానిక్ గూడ్స్, కిచెన్ సామగ్రి, స్కూల్ బ్యాగ్‌లు, లగేజీ బ్యాగులు, టూరిస్ట్ బ్యాగ్‌ల వరకు అన్నీ విక్రయిస్తారు. ఎంత వ్యాపారమైనా ఫుట్‌పాత్‌పైనే జరిగిపోతుంటుంది.



ఫుట్‌పాత్‌పైనే అందుబాటు ధరలో వస్త్ర విక్రయాలు

క్వాలిటీ ఐటెమ్స్‌నే విక్రయిస్తాం..

వండగలు, పెళ్లిళ్లకు పెద్దపెద్ద షోరూంలకు వెళ్తుంటారు. కానీ ఫుట్‌పాత్ వ్యాపారుల వద్ద ఏ పనిమీద అటు వచ్చినా వస్తారు. ధర బాగుండి.. ఐటెం నచ్చితే కొనుగోలు చేస్తారు. అలాగే మన్నిక కూడా చూస్తారు కనుక క్వాలిటీ ఐటెమ్స్‌నే మేము విక్రయిస్తాం. అందుకే కస్టమర్లు మా వద్దకు వస్తారు.

– సంజీవ్‌కుమార్, ఫుట్‌పాత్ వ్యాపారి

బ్రాండెడ్‌కు దీటుగా విక్రయాలు..

ఇరవై అయిదేళ్లుగా ఫుట్‌పాత్‌పైనే వ్యాపారం చేస్తున్నాను. గతంలో కంటే ఇప్పుడు వ్యాపారం బాగుంది. యువత కోరుకునే ఐటెమ్స్ విక్రయిస్తుండడం వల్ల అమ్మకాలు బాగా సాగుతున్నాయి. బ్రాండెడ్ వస్తువులకు ఏమాత్రం తగ్గని క్వాలిటీ వస్తువులు దొరుకుతాయి కాబట్టి మా వద్దకు కస్టమర్లు వస్తుంటారు.

–సురేష్ రాహుల్, ఫుట్‌పాత్ వ్యాపారి

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న విద్యుత్ మీటర్ రీడర్లు

దాబాగార్డెన్స్: విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మీటర్ రీడర్స్ (ఏఐటీయూసీ అనుబంధం) అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన ధర్నానుద్దేశించి మాట్లాడారు. విద్యుత్ మీటర్ రీడర్లను ఏపీ విద్యుత్ డిస్కంలో పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించకపోగా, ఉన్న ఉద్యోగులను రోడ్డున పడేసి, సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలపై పెను భారం మోపుతూ, రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను అంధకారం చేయడానికి స్మార్ట్ మీటర్ల పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ ఉద్యోగులు నిరుద్యోగులు కావడమే కాక, వినియోగదారులందరిపై సింగిల్ ఫేస్ మీటర్‌కు 13,500, త్రీఫేస్ మీటర్‌కు 32,000 వాయిదా పద్ధతిలో వసూలు చేయడానికి నిర్ణయించారని తెలిపారు. ఒక వేళ మీటర్లు బర్న్ అయినా, లేక ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల వల్ల దెబ్బ తిన్నా, మరలా వినియోగదారుల వద్ద సింగిల్ ఫేస్ మీటరుకు రూ.6 వేలు, త్రీఫేస్ మీటర్‌కు రూ.13 వేలు వసూలు చేయడానికి నిర్ణయించారని తెలిపారు. అలాగే వైరింగ్‌లో లోపాలున్నా ఈ స్మార్ట్ మీటర్‌లో అధిక రీడింగ్ చూపిస్తున్నాయని, ఆ విధంగా ప్రజలు, వినియోగదారులను దోచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త మీటర్లు తీసుకొస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ రెహ్మాన్, విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, విశాఖ జిల్లా కార్యదర్శి క్రాంతి, టి. గణేష్, ముత్యాలరావు, సురేష్, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖకే ఎగనామం

- లీజుకు తీసుకున్న అంబికాబాగ్ దేవస్థానం కల్యాణ మండపానికి బకాయిలు
- ఇప్పటి వరకు రూ. 24 లక్షల పైబడి బకాయిలున్న కూటమి నేత

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్‌గా 2022 నుంచి రెండేళ్ల పాటు కొనసాగిన కొల్లి సింహాచలం కుమారుడు కె. శ్రీనివాసరావు పేరిట కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి దేవస్థానం కల్యాణ మండపాన్ని ఆరేళ్ల పాటు లీజుకు తీసుకున్నారు. దాదాపు తొమ్మిది నెలల పాటు చెల్లించాల్సిన అద్దె మొత్తాన్ని ఆమె చెల్లించకపోవడంతో కనకమహాలక్ష్మి దేవస్థానం అధికారులు నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉండగా దాదాపు 10 నెలల పాటు దేవస్థానానికి చెల్లించాల్సిన అద్దె బకాయిలు చెల్లించకపోయినా ఎవరూ అడగకుండా కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన.. స్థానిక జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా కండువా కప్పుకోవడం విశేషం.

లీజు వివరాలివి..

దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆమె 2022 జూన్ ఒకటిన ఆరేళ్ల లీజుకు నెలవారీ అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. మొదటి సంవత్సరం రూ.2,10,000, రెండో సంవత్సరం రూ.2,10,000, మూడో సంవత్సరం రూ.2,31,000, నాల్గో సంవత్సరం రూ.2,54,100, ఐదవ సంవత్సరం రూ.2,79,510, ఆరవ సంవత్సరం రూ.3,07,461గా అద్దె చెల్లించేందుకు కల్యాణ మండపం సొంతం చేసుకున్నారు.

గత తొమ్మిది నెలల బకాయిలు..

గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు నెలకు రూ.2,31,000 చొప్పున రూ.20,79,000. జీఎస్టీ నెలకు రూ.41,580 చొప్పున తొమ్మిది నెలలకు రూ.3,74,220 మొత్తంగా రూ.24,53,220 బకాయి పడి ఉన్నారు. ఈ విషయమై దేవస్థానం అధికారులు నోటీసు జారీ చేశారు.



అంబికాబాగ్ రామాలయ కల్యాణ మండపం

ఫైనల్ నోటీస్ ఇచ్చాం..

దేవదాయ శాఖ నియమ నిబంధనల మేరకు కనకమహాలక్ష్మి దేవస్థానం దత్తత దేవాలయమైన అంబికాబాగ్ దేవస్థానం కల్యాణ మండపం బకాయి పడ్డ రూ.24,53,220 చెల్లించాలంటూ ఫైనల్ నోటీస్ ఇచ్చింది. వారం రోజులు గడువిచ్చాం. ఆ గడువులోగా మొత్తం చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– కె.శోభారాణి, ఈవో, కనకమహాలక్ష్మి దేవస్థానం

అక్రమ పొగాకు వ్యాపారం పెరగడంపై పీఎంఐ ఆందోళన

దాబాగార్డెన్స్: అక్రమ పొగాకు వ్యాపారం పెరగడంపై ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ (పీఎంఐ) ఆందోళన వ్యక్తం చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధి రోడ్నీ వాన్ డూరెన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'అక్రమ సిగరెట్లను అడ్డుకోవడం' అనే అంశంపై ఇటీవల జరిగిన సదస్సులో పొగాకు మార్కెట్‌ను ఎదుర్కొనేందుకు సీమాంతర సహకారం, చట్టాలు కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. అక్రమ వ్యాపారాన్ని నిర్మూలించేందుకు పీఎంఐ చాలా కాలంగా ప్రయత్నిస్తోందని, ప్రపంచ వ్యాప్తంగా అక్రమ వ్యాపారాన్ని నిరోధించేందుకు పీఎంఐ 5 కీలకమైన రంగాలపై దృష్టి సారించిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధన, మేధస్సు, సరఫరా గొలుసును రక్షించడం, భాగస్వామ్యాలు, చట్ట అమలుతో సహకారం, అవగాహన పెంచడం, స్వాధీనం చేసుకున్న ఉత్పత్తుల తనిఖీ, ప్రామాణీకరించడం, ఫోరెన్సిక్ మూల్యాంకాలను నిర్వహించడం ద్వారా చట్టాన్ని జారీ చేసే ఏజెన్సీలకు మద్దతుగా పీఎంఐ ఇండియా సహకరిస్తుందన్నారు. పీఎంఐ ఇండియా దేశ ఆర్థిక ప్రయోజనాలు కాపాడేందుకు, వినియోగదారులను రక్షించేందుకు, అక్రమ పొగాకు వ్యాపార నిరోధానికి నిబద్ధతతో పని చేస్తుందన్నారు.

పూర్ణామార్కెట్ ఆశీలు పాట రూ. 81.10 లక్షలు



ఆశీలు వేలం పాట నిర్వహిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: పూర్ణామార్కెట్ ఆశీలు పాట ఈ ఏడాది రూ. 81 లక్షల పదివేలకు కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. గురువారం జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతుబజార్ ఆశీలు వేలం పాట నిర్వహించారు. దీనిలో పూర్ణామార్కెట్ ఆశీలు పాట రూ. 81.10 లక్షలకు, రామకృష్ణా రైతుబజార్ పాట రూ. 19.50 లక్షలకు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. దీంతో మొత్తంగా జీవీఎంసీకి ఈ ఏడాదికి గాను రూ. కోటీ అరవై లక్షల ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు అప్పలరాజు, సీతారాం, సూపర్‌వైజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల అడ్డగింత



పార్టీ బీసీ నాయకుడు బొండాడ వెంకట్రావును నిలిపేసిన మహారాణిపేట పోలీసులు



పీతల వాసు, బెవర మహేష్, ఆరుగుల రాజును అడ్డుకున్న పోలీసులు

దాబాగార్డెన్స్: పీఎం పాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు ఉన్న మహానేత డాక్టర్ వైఎస్సార్ పేరు తొలగింపుపై నిరసన తెలిపేందుకు పార్టీ గురువారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు నియోజకవర్గం నుంచి పలువురు నేతలు అక్కడికి వెళ్లేందుకు సిద్ధమైన నేపథ్యంలో మహారాణిపేట సీఐ బి. భాస్కరరావు వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డగించారు. పార్టీ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా ఎక్కడికక్కడ నిలిపివేయడంతో నాయకులు, కార్యకర్తలు నిరాశ చెందారు. ఈ సందర్భంగా నేతలు పీతల వాసు, బొండాడ వెంకట్రావు, బెవర మహేష్, ఆరుగుల రాజు మాట్లాడుతూ విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు మహానేత డాక్టర్ వైఎస్సార్ పేరు తొలగించేందుకు చేస్తున్న కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచనలు సాగనివ్వమని స్పష్టం చేశారు. వైఎస్సార్ ఆనవాళ్లు తుడిచేయాలని చంద్రబాబునాయుడు అనుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమంలో తమను పాల్గొనేందుకు వెళ్లనివ్వకుండా చేస్తున్న కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు.

ముగిసిన రేణుక యల్లమ్మ జాతర



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న డాక్టర్ రమణమూర్తి, వెంకట అప్పలనాయుడు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జాము నుంచి భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భారీ ఎత్తున అన్న సమారాధన జరిపారు. కళా హాస్పిటల్ అధినేత పైడి రమణమూర్తి పాల్గొని అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయన అమ్మవారికి పూజలు చేశారు. ఆయనకు ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, ఉపాధ్యక్షుడు కొణతాల గణేష్, కార్యదర్శి బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ, శివ, తమరపు మధు తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్'ను ఐఐఎస్‌సీ బెంగళూర్ ప్రొఫెసర్ ఎస్. నటరాజన్, ప్రొఫెసర్ బాలాజీ ఆర్. జాగీర్దార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో నానో మెటీరియల్స్, ఇన్ ఆర్గానిక్ మెటీరియల్స్, హైడ్రోజన్ ఇంధనం ఉపయోగాలపై లెక్చర్ సాగింది. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఆర్. ప్రసాద్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. కల్యాణ్‌రామ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత



జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో పక్షుల ప్రాధాన్యత తెలుపుతూ ఏర్పాటు చేసిన చిత్రాలు

ఎంవీపీకాలనీ: శివాజీ పార్క్‌లో గురువారం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతరించిపోతున్న పిచ్చుకలను సంరక్షించడం ప్రజలందరి బాధ్యతని పేర్కొన్నారు. పీఆర్‌వో నాగేశ్వరరావు, సంస్థ ఉత్తరాంధ్ర కన్వీనర్ అను, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణలో పిచ్చుకలకు స్థానం

ఏయూక్యాంపస్: జీవ వైవిధ్య పరిరక్షణలో పిచ్చుకల స్థానం ఎంతో కీలకమని జీవీపీ ఎంఎల్‌బీటీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.మధురవాణి అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా బీచ్‌లోని పాఠశాల పరిసరాల్లో పక్షుల కోసం నీటి పాత్రలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పర్యవేక్షించారు.

కుటుంబం చెంతకు ఒడిశా వాసి



సుబుదిని తల్లికి అప్పగిస్తున్న శ్రద్ధా ఉద్యోగి



షెల్టర్ హోంలో ఆశ్రయం పొందిన సురేంద్రరెడ్డి

సీతమ్మధార: ఒడిశాలోని గంజాం జిల్లా బరంపూర్‌కు చెందిన సునం సుబుది హోటల్లో పని చేసేవాడు. అయితే తర్వాతి కాలంలో అతను మానసిక వ్యాధికి గురయి కుటుంబ సభ్యులను చితకబాదేవాడు. పలుమార్లు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతనికి తల్లి, సోదరుడు ఉన్నారు. ఆరు నెలల క్రితం ఊరు వదిలి వైజాగ్ వచ్చేసాడు. అతన్ని రైల్వే స్టేషన్‌లో ఏయూటీడీ సిబ్బంది గుర్తించి షెల్టర్ హోంకి తరలించారు. అతని వ్యాధికి చికిత్స అందజేయడంతో కోలుకున్నాడు. తన చిరునామా తెలిపాడు. దాంతో అతన్ని తల్లి దేబజకి అప్పగించినట్లు షెల్టర్ హోం నిర్వాహకులు తెలిపారు.

అభాగ్యుడికి ఆశ్రయం..

తెనాలి సమీపంలోని పరిమి గ్రామానికి చెందిన సురేంద్రరెడ్డి (70) అవివాహితుడు. ఇతని తల్లిదండ్రులు, అన్నదమ్ములు మరణించారు. అతని మూడెకరాల పొలం వదిన ఆధీనంలో ఉండడంతో అనాథగా మారాడు. భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఇతన్ని కొందరు చూసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని షెల్టర్ హోంకు తీసుకొచ్చారు. సంస్థ కార్యదర్శి అతన్ని చేర్చుకున్నారు. స్నానం తర్వాత దుస్తులు, భోజనం ఇచ్చి వసతి కల్పించారు.

దుకాణాల ముందు చెత్త ఉంటే జరిమానా



పూర్ణామార్కెట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: దుకాణాల ముందు చెత్త కనిపిస్తే అపరాధ రుసుము విధించాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. గురువారం పూర్ణామార్కెట్‌లో పర్యటించారు. దుకాణాల ముందు ఉన్న చెత్తను చూసి అసహనం వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో రహదారులు, మార్కెట్లలో చెత్త పేరుకుపోవడం పట్ల సిబ్బందిపై మండిపడ్డారు. ఇళ్లలోనే కాకుండా దుకాణాల వద్ద కూడా చెత్త డబ్బాలు పెట్టి అందులోనే చెత్త వేయాలని పారిశుద్ధ్య కార్మికులు, సెక్రటరీలకు ఆదేశించారు. వ్యాపారులు రోజు రాత్రి ఇంటికి వెళ్లే ముందు జీవీఎంసీ డంపర్ బిన్లలో చెత్త వేసి వెళ్లాలన్నారు. దీని వల్ల ఉదయం మార్కెట్‌కు వచ్చే సరికి పరిశుభ్రంగా ఉంటుందన్నారు. అలా చేయని పక్షంలో ఆయా దుకాణదారుల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సత్యనాయణ, పారిశుద్ధ్య సిబ్బంది, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమస్యల్ని పట్టించుకోండి



సమావేశంలో సంఘ ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామచంద్రరావు, పి.వి.రాంకుమార్

సీతమ్మధార: అఖిల భారత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య దేశ వ్యాప్తంగా ఉన్న 3 లక్షల మంది విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై నేరుగా ప్రభుత్వంతో చర్చించే అవకాశం లేదని సమాఖ్య ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామచంద్రరావు, పి.వి.రాంకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆశీలమెట్టలోని ఓ హోటల్లో గురువారం జరిగిన సంఘ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. సమస్యలపై యూఎఫ్‌బీయూతో చర్చించినా.. వారు బ్యాంకుల్లో పనిచేస్తున్న వారిపైనే శ్రద్ధ చూపుతున్నారు తప్ప, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. 1986 నుంచి బ్యాంక్ ఉద్యోగులకు పెన్షన్ విధానం అమలు చేస్తున్నా.. బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సవరణ జరగడంలేదని ఆక్షేపించారు. బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు తమ పెన్షన్ నుంచే ఆరోగ్య బీమా చెల్లింపులు చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలను సంఘటితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.